# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 01    సంచిక : 65    ప్రకాశం, గురువారం 04-12-2025    పేజీలు : 4    వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## వైస్సార్సీపీ RTA మెంబర్ కదం పవన్ ఆధ్వర్యంలో యూత్ మీట్





**క్రైమ్ కౌంటర్ న్యూస్.... ప్రకాశం జిల్లా....** కంభం పట్టణంలో వైస్సార్సీపీ యూత్ మీట్ ను ఏర్పాటు చేసిన కదం పవన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్.మరియు మాజీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్ కుమారుడు శ్రీశైలం నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షుడు మోమిన్ ముస్తఫా తో జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ %=×% విభాగం ఎగ్జిక్యూట్ మెంబర్ కదం పవన్ , భేటీ అయ్యారు రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేయడం కోసం కులమతాలకు అతీతంగా యువత మొత్తం ఒకే తాటిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని కదం పవన్ ఆకాంక్షించారు....

## అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం




**ఒంగోలు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లో బాల భవిత కేంద్రం లో చికిత్స పొందుతున్న చిన్నారులకు డి ఈ ఐ సి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత శుభాకాంక్షలను తెలిపారు.దీని ద్వారా ఎంతో మంది చిన్నారులకు ఉ జ్వల భవిష్యత్తు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కి ఒంగోలు డి ఈ ఐ సి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత ,తల్లిదండ్రులుధన్యవాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పీడియాట్రిక్ హెచ్.ఓ.డి డాక్టర్ తిరుపతి రెడ్డి డాక్టర్ ప్రీతం డాక్టర్ జయ, మరియు విద్య శ్రీ వైష్ణవి, అనిల్, రాజా, రాము,అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ప్రజలు సహాకరించాలి..ఎస్ఐ జి. సుబ్బారావు



**ఉలవపాడు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,** మండలములో ప్రజలు శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ జి సుబ్బారావు అన్నారు. ఉలవపాడు ఎస్ఐగా ఆయన పదవి బాధ్యతలను చేపట్టారు. గతంలో ఉ లవపాడు పోలీస్ స్టేషన్ లో.పనిచేసిన ఎస్ఐ. కే అంకమ్మ బదిలీ అయ్యారు.

## ఎన్‌హెచ్-16పై ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేయండి..

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వినతి



**నెల్లూరు కంచర్ల మల్లికార్జునరావు క్రైమ్ కౌంటర్,**నగరం పరిధిలో జాతీయ రహదారి-16పై ఎన్‌టీఆర్ నగర్ ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత చాలా ఉందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఢిల్లీలోని ఆయన ఛాంబర్‌లో కలుసుకుని ఫ్లై ఓవర్ అంశాలపై చర్చించారు. శ్రీ వేణుగోపాల స్వామి డిగ్రీ కళాశాల/ఎన్టీఆర్ నగర్ సమీపంలో, ఎన్ హెచ్ 16 పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని వివరించారు. నెల్లూరు నగరం నుండి భారీ ట్రాఫిక్‌ను మళ్లించడానికి ఎన్ హెచ్ ఏ ఐ అధికారులు మొదట బైపాస్ రోడ్డును అభివృద్ధి చేశారని, అయితే, నగరం వేగంగా విస్తరిస్తూ.. ఎన్ హెచ్-16 యొక్క బైపాస్ రోడ్డు ఇప్పుడు నగరంలోని కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఎన్టీఆర్ నగర్, చెరుకు తోట, పద్మావతి గ్రీన్ సిటీ, నిర్మల లేఅవుట్, వేప దొరువు ప్రాంతాలు భాగమయ్యాయన్నారు. దీని ఫలితంగా నాలుగు లేన్లుగా ఉన్న ఈ జాతీయ రహదారి-16కు ఇరువైపులా రోజంతా భారీ సంఖ్యలో పాదచారులు మరియు వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని చెప్పారు.

వాహన రాకపోకలు పెరగడం వల్ల శ్రీ వేణుగోపాల స్వామి డిగ్రీ కళాశాల/ఎన్టీఆర్ నగర్ సమీపంలో ట్రాఫిక్ వల్ల చాలా ప్రమాదాలకు కారణమవుతోందని, గత కొన్ని సంవత్సరాలుగా, ఈ ప్రదేశంలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించాయన్నారు. దీని ఫలితంగా అనేక మంది ప్రాణాలు కోల్పోగా.. చాలామంది శాశ్వత వైకల్యాలు, తీవ్ర గాయాల పాలయ్యారని వివరించారు.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జంక్షన్ వద్ద సురక్షిత ప్రయాణానికి రోడ్ ఓవర్ బ్రిడ్జి/ ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సంతోష్ కుమార్ యాదవ్... ఎన్టిఆర్ నగర్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి కృషి చేస్తామని, ప్రమాదాల నివారణకు చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బుచ్చిరెడ్డిపాలెంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చర్యలను తీసుకోండి..

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వినతి



**నెల్లూరు కంచర్ల మల్లికార్జున రావు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,**జిల్లాలోని కోవూరు అసెంబ్లీ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం మునిపిపాలిటీ గుండా వెళ్లే జాతీయ రహదారి -67పై( ఛుంచీలూరు నుంచి నెల్లూరు వరకు) లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఢిల్లీలోని ఆయన ఛాంబర్‌లో కలుసుకుని ఇందుకు సంబంధించి వినతి అందజేశారు.బుచ్చిరెడ్డిపాలెం మునిసిపాలిటీ పరిధిలో ఎన్ హెచ్-67 (ఛుంచీలూరు నుండి నెల్లూరు వరకు) సెక్షన్‌లో కి.మీ. 722.33 నుంచి కి.మీ 724.800 వరకు లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారిందని, దీని కారణంగా తాత్కాలిక షెడ్‌లు మరియు నెట్టడం బండ్ల రూపంలో రోడ్డుపై ఆక్రమణలు పెరుగుతున్నాయన్నారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేయకపోవడం, పాదచారులకు సురక్షితమైన, ప్రత్యేక ఫుట్‌పాత్ లేకపోవడం సమస్యగా మారిందని వివరించారు. దాంతో ప్రజలకు అసౌకర్యంగా ఉండటంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి-67పై లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణ పనులను చేపట్టాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సంతోష్ కుమార్.. తప్పకుండా వినతులను పరిశీలించి బుచ్చిలో ట్రాఫిక్ నియంత్రణకు లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు తగిన చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సబ్ కలెక్టర్ హిమా వంశిను కలిసిన సక్షమ్ కార్యకర్తలు



**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సక్షమ్ దివ్యాంగ సేవాకేంద్రం తరపున సక్షమ్ కార్యకర్తలు , దివ్యాంగులు సబ్ కలెక్టర్ హిమావంశిను బుధవారం కలిసారు. ఈ సందర్భంగా సక్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చన్నా వెంకట రామాంజనేయులు దేశ వ్యాప్తంగా సక్షమ్ దివ్యాంగులకు చేస్తున్న సేవలను వివరించారు. స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు , ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తో కలిసి ఆయనకు గులాబీ పూలను బహుకరించారు. ఈ సందర్భంగాఆయన దివ్యాంగులకు బిస్కెట్ ప్యాకెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ క్యాషియర్ జ్యోతి ఆర్ పి డి యాక్ట్ - 2016 ప్రతిని ఆయనకు అందచేశారు.

## నేడు పవన్‌కల్యాణ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3 చిత్తూరు పర్యటన నిమిత్తం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం రానున్నారు. ఉదయం 9.50 గంటలకు గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రేణిగుంట నుంచి రోడ్డుమార్గాన చిత్తూరుకు 11.30గంటలకు చేరుకుంటారు. అక్కడ ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయాలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచే వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డీడీవో కార్యాలయాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చిత్తూరు నుంచి రోడ్డుమార్గాన రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 1.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి గన్నవరం వెళతారు.



# హాస్టల్ సంక్షేమాధికారిణి సస్పెండ్

## చజిల్లాకలెక్టర్: పి.రాజాబాబు




**ఒంగోలు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,**సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం కొనకనమిట్ల లోని విద్యార్థులు ఆదివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం లేక ఆకలితో విలవిలలాడి చివరకు తల్లిదండ్రులతో ఇంటికి వెళ్ళిపోయిన సంఘటన పైన విచారణను చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నివేదిక లో సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారి పర్యవేక్షణ లోపం వలన విద్యార్థులకు సకాలంలో భోజనం అందించకపోవటం వలన సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారిని కామాటిని సస్పెండ్ చేస్తూ కలెక్టరు ఉత్తర్వులను జారీ చేశారు.జిల్లా లోని అందరు సహాయ సాంఘిక సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు నాల్గవ తరగతి సిబ్బంది తమ తమ విధుల పట్ల అత్యంత బాధ్యతతో వ్యవహరించి, విద్యార్థుల సంక్షేమం, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత మరియు రోజువారీ పర్యవేక్షణ విధులను సమయానికి, విధి ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించవలసినదిగా ఆదేశించుచూ విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన సందర్భంలో కఠిన చర్యలను తీసుకుంటామని డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మా నాయక్ పత్రికా ముఖంగా తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం



**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** పట్టణంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయంలో హనుమద్ వ్రతాన్ని ఆలయ అర్చకులు అనంత్ స్వామి, కిషోర్ స్వామి శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ గురు స్వామి హనుమద్ ప్రసాద్ స్వామి, హనుమాన్ మాల ధారణ స్వాములు భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతాన్ని ఆచరించారు. ఒంటె వాహనంపై సువర్చల ఆంజనేయస్వామిని కన్నుల పండుగగా అలంకరించారు. హనుమద్ వ్రతాన్ని ఆచరించటం వలన కలిగే మంచిని గూర్చి భక్తులకు వివరించారు. ఆలయ అర్చకులు హనుమద్ మూలమంత్ర హెూమాన్ని, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది.వ్రతం అనంతరం ఒంటె వాహనంపై స్వామివారికి గుడి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో చెమిడిదిపాడు పంచముఖ ఆంజనేయ స్వామి ట్రస్ట్ చైర్మన్ ఆలూరి హనుమంతరావు స్వామి,గురుస్వామి గడిపూడి ప్రసాద్, బత్తుల శ్రీనివాసులు, చక్కా వెంకట కేశవరావు, రాంబంటు స్వామి, వెంగమాంబ శీను స్వామి, గుడ్లూరు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమత్ వ్రతం



**గుడ్లూరు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,**మార్గశిర మాసం త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మిట్టపాలెం లో ఉన్నటువంటి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి సన్నిధిలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమత్ దీక్షాపరుల గురుస్వామి ఎయిర్టెల్ చిన్న ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శేషాచార్యులు వారి కుమారుడు భరద్వాజ గార్ల సమక్షంలో హనుమత్ దీక్షపరుల చే హనుమత్ వ్రతం పూజా కార్యక్రమలను బుధవారంవైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు సువర్చల ఆంజనేయ స్వామి వార్లను అలంకరించి, షోడశోపచారా పూజ,పంపా కలశ స్థాపన ఆవాహన పూజ,, సహస్రనామ పూజ,, సింధూరభిషేకం అష్టోత్తర శతనామావళి పూజ కార్యక్రమాలనునిర్వహించారు . ఈ పూజా కార్యక్రమంలో రాజుపాలెం గ్రామానికి చెందిన హనుమత్ భక్తులు మరియు గుడ్లూరు గ్రామానికి చెందిన హనుమత్ భక్తులు పాల్గొని స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ సందర్భంగా స్వామియే శరణం ఆంజనేయ అనే శరణు ఘోషతో ఆలయ ప్రాంతం మారుమోగిపోయింది. కార్యక్రమం అనంతరం అర్చక స్వాములవారు భక్తులకు, దీక్షపరులకు తీర్థ ప్రసాదాలను అందించారు ఈ కార్యక్రమంలో గుడ్లూరుకు చెందినటువంటి హనుమత్ దీక్షపరులు ఎయిర్టెల్ చిన్న,చుండూరి.హరిబాబు,కర్పూరపు మాలకొండయ్య హనుమత్ దీక్షపరులు, ఆంజనేయ స్వామి భక్తులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వామిత్వ సర్వే పై అవగాహన కల్పిస్తున్న... డాక్టర్ ఆకుపాటి వెంకటేష్





**పామూరు, డిసెంబర్3, క్రైం కౌంటర్** స్వామిత్ర సర్వేపై పామూరు రెండవ ఎంపిటిసి సభ్యులు, జిల్లా ఎంపిటిసి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ బుధవారం స్థానిక అంకాలమ్మ వీధిలోనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ కంఠంలోని ఇంటి కొలతను కొలిచి వారికి" ప్రాపర్టీ స్మార్ట్ కార్డు "కేంద్ర ప్రభుత్వం వారు అందజేసి తద్వారా ఆ ఇంటి యజమానికి రిజిస్ట్రేషన్ అయ్యేలా ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య, పంచాయతీ కార్యదర్శి జి అరవింద రెడ్డి , పామూరు సర్పంచ్ అల్లూరి రాగమ్మ, బిజెపి నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్య మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారులు

**ఉలవపాడు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,**జిల్లా పరిశీలకులు , డైట్ సీనియర్ లెక్చరర్విజయకృష్ణ అకడమిక్ మానిటరింగ్ లో బాగా ఉలవపాడు మండలం లోని భీమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలభీమవరం ఏఏసి పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పలు రికార్డు లను తనికి చేసి సంతృప్తి వ్యక్త%శీ% చేసారు.టీచర్స్ హ్యాండబుక్స్ విద్యార్థుల. అసెస్మెంట్ బుక్లెట్లు. వర్క్బుక్స్ హెచ్ పీ సీ లను పరిశీలించి పెండింగ్లో ఉన్న ఎంట్రీలు పై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఉపాధ్యాయుల హ్యాండ్బుక్లు ఉపయోగించాలి రిఫ్లక్షన్స్ డైరీ ఐటమ్స్ వ్రాసి హెచ్ ఎం ద్వారా అప్రూవల్ నీ చేయించుకోవాలనిఆయన తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను తరగతి వారిగా తనిఖీ చేసి తెలుగు సబ్జెక్ట్ లో బాగా వెనుకబడి వున్నారని సూచించారు. ఎఫ్ ఎల్ ఎన్. స్కిల్స్ పై బాగా దృష్టి కేంద్రీకరించాలి అని ఆయన ఉపాధ్యాయులకు తెలియజేశారు . జి ఎఫ్ ఎల్ ఎన్ సర్వే ను మానిటరింగ్ చేసారు. మెగా పిటిఎం. అనంతరం విస్తృతంగా తనిఖీలు వుంటాయని మండలం లోని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. మండల విద్యాశాఖ అధికారి.



రమణయ్య. సి ఆర్ పి . అమూల్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడితే మంచి లాభాలు..

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**పాతతరం వ్యవసాయ విధానాలను పాటిస్తూనే, కొత్త టెక్నాలజీని ఫాలో అవుతూ వ్యవసాయం చేస్తే మంచి లాభాలను పొందవచ్చని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండలం లోని కొండముడుసుపాలెంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం వారికోసం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్ర వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ ఒకటిన్నర ఏడాదిరి కాలంలో రెండుసార్లు అమలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 6వేలకు, రాష్ట్ర ప్రభుత్వం మరో 14 వేలు కలిపి రైతులు ఖాతాలో జమ చేసిందన్నారు. కొండముడుసుపాలెం గ్రామంలో 563 మంది రైతులకు 38.35 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి, రైతు కుటుంబాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. రైతుల కోసం ప్రత్యేక పథకాలు, సబ్సిడీ రుణాలు, ఆధునిక యంత్రాలను అందిస్తున్నారని అన్నారు.



రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా వినియోగించ కుండా, ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం రాగులు, సజ్జలు, జొన్నలు లాంటి మిల్లెట్స్ వాడకం బాగా పెరిగింది అన్నారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసే చాలామంది వాటిని వదిలేసి, మిల్లెట్స్ సాగు చేస్తూ నెలకు రెండు మూడు లక్షల సంపాదిస్తున్నారని తెలిపారు. రైతులమిల్లెట్స్ సాగుపై దృష్టి పెట్టాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందవచ్చని సూచించారు.సంవత్సరాల తరబడి పొలంలో ఒకే పంటను సాగు చేయ కుండా, పంట మార్పిడి పద్ధతిని పాటిస్తే బాగుంటుందన్నారు.

అనంతరం అధికారులతో రైతులకు సరిపడా ఎరువులను ఉంచుకోవాలని సూచించారు. రైతులకు ఎరువులు, పశువుల మేతను ఆయన స్వయంగా అందజేశారుఈ కార్యక్రమంలో వెటర్నరీ డిడి డాక్టర్ జి .శ్రీధర్ సుధాకర్ , ఏడిఏ చంద్రమౌళి, అగ్రికల్చర్ ఏడి కేవీ శేషారెడ్డి, ఏ ఓఅగ్రికల్చర్ ఆఫీసర్ రహీం, హార్టికల్చర్ ఏవో జ్యోతి, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్తారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ తుమ్మ కోటేశ్వరమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలా రంగారావు, పార్టీ నాయకులు పొడపాటి మహేష్ గొంది నర్సింగరావు, మాదాల రవికుమార్, సోమినేని కొండలరావు గ్రామ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల సభ్యులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్ : ఎంఈఓ నాగకుమార శర్మ

**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాల్లో బంగారు భవిష్యత్ లభిస్తుందని కందుకూరు ఎంఈఓ ఎం నాగకుమార శర్మ అన్నారు. బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక అభ్యుదయ పాఠశాలలోని భవిత కేంద్రంలో ఐఈఆర్పీ కూనం ఉదయ లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ శర్మ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరూ ప్రేమతో అక్కున చేర్చుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతులైన వారి విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రశస్థ 3.0 యాఫ్ లో వికలాంగ విద్యార్థుల వివరాలు నమోదు చేయడం ద్వారా వారికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సభాధ్యక్షులు, హెచ్ఎం దివి కోటేశ్వరరావు మాట్లాడుతూ



అంగవైకల్యం శాపం కాదని తెలిపారు. వైకల్యం ఉందని బాధపడకుండా తమ సామర్థ్యాన్ని వినియోగించు కోగలిగితే దివ్యాంగులు అసాధారణ ప్రజ్ఞావంతులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉదయలక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి..

## ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

### పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన.. ఆకుపాటి వెంకటేష్



**పామూరు, డిసెంబర్ 3, క్రైం కౌంటర్** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అందరికీ అందించాలని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ సమావేశంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల సర్వసభ సమావేశానికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారాన్ని చూపాలని అన్నారు. ప్రతి ఒక్క అధికారి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు, సమస్యలు తీర్చనచో అట్టి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పామూరు రెండవ ఎంపిటిసి సభ్యులు ఆకుపాటి వెంకటేష్ డంపింగ్ యార్డ్ , రెండవ సచివాలయం, కందుకూరు రోడ్డు రహదారి,విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య,మరియు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, అందరు పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్, లోకేష్ ఫోటోలకు పాలాభిషేకం...

## ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు

**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు**,నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వంపైప్రజలు తమ అభిమానాన్ని ఉప్పొంగిపోయేలా చాటుకున్నారు. తమ ఆకాంక్షను నెరవేర్చారంటూ స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు జేజేలు పలికారు. కాలేజీ యువత మొదలుకొని వృద్ధుల వరకు స్వచ్ఛందంగా తరలివచ్చి పట్టణంలో బుధవారం గొప్ప ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, డాక్టర్లు, లాయర్లు,ఇలా అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలునుతెలియజేశారు. ముందుగా ఆధ్వర్యంలో పట్టణంలోని పామూరు రోడ్డు జంక్షన్ నుంచి ర్యాలీ మొదలు కాగా, ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికిఆయన సహా పలువురు నేతలు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత జేఏసీ, ప్రజాసంఘాల నేతలు కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువత హుషారుగా డాన్సులు వేస్తూ, ఎమ్మెల్యే కు జై కొడుతూ ర్యాలీలో పాల్గొని సందడి చేశారు. అనంతరం ఆయనమాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం దుర్మార్గమైన నిర్ణయం కారణంగా కందుకూరు నియోజకవర్గం నెల్లూరులో కలిసిందని, మూడేళ్లుగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల, 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఆ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయం తీసుకుంటే, వారి ఆగ్రహం ఏ స్థాయిలో ఉంటుందో కందుకూరులో అందరూ చూశారని అన్నారు. ప్రజలంతా ఏకమై రోడ్లమీదకు వచ్చి 55 రోజుల పాటు దీక్షలు, ధర్నాలు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అనిపించలేదన్నారు.

కందుకూరు ప్రజల ఇబ్బందులను గమనించి, గత ఎన్నికలకు ముందు ఒంగోలులో జరిగిన మహానాడులో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టిన సంగతిని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే కందుకూరుకు న్యాయం చేస్తానని చంద్రబాబు అనాడే చెప్పారని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రకు వచ్చిన సందర్భంలో, వలేటివారిపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతూ, కందుకూరుకు న్యాయం చేస్తానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, అందుకు ప్రభుత్వంలోని పెద్దలందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ ఇతర పెద్దలందరికీ ధన్యవాదాలను తెలిపారు. గతంలో 24 మండలాలతో కందుకూరు డివిజన్ విస్తరించి ఉండేదని, కందుకూరు వైభవాన్ని నాశనం చేశారని జగన్మోహన్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వ కార్యాలయాలు కందుకూరు నుంచి తరలి వెళ్లాయని, దీనివల్ల ప్రజల ఇబ్బందులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ప్రభుత్వం దృష్టికి




తీసుకువెళ్లి, ఆ కార్యాలయాలన్నీ కందుకూరుకు తిరిగి వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. మొత్తంగా కందుకూరుకు పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తానన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల ఆశయాలకు విరుద్ధమైన పనులు చేయదని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగులు వేస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో ఈ ఏడాదిన్నర కాలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ పరిశ్రమల వల్ల వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. ఇకనుంచి కందుకూరు నియోజకవర్గం యువత భవిష్యత్తు బంగారుమయం కాబోతుందన్నారు. ఇంత పెద్ద ఎత్తున ర్యాలీకి తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీ నేత మురళి, జనసేన నేత శిగా తిరుపాలు, లాయర్ బెజవాడ క్రిష్ణయ్య, జేఏసీ నేత బి వెంకటేశ్వర్లు, ఉద్యోగుల తరపున ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాసరావు చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, కల్లూరు శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, కొత్తూరు వెంకట సుధాకర్, మురారిశెట్టి వెంకట సుదీర్, సయ్యద్ అహ్మద్ బాషా, షేక్ సలాం, షేక్ రూబీ, షేక్ ఫిరోజ్, ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీనివాసరావు చనమాల శ్రీధర్, శ్యామ్, జేఏసీ సభ్యులు, అన్ని గ్రామ పార్టీ నాయకులు, కూటమి నేతలు, మహిళలు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాంగ్ మెసేజ్.. ఒక్కసారిగా మారిపోయిన అతని జీవితం

అతనో ప్రైవేట్ ఉద్యోగి.. ఊరు కృష్ణా జిల్లాలోని పెనమలూరు.. ప్రైవేట్ ఉద్యోగం, సరిపడా జీతం.. చక్కగా సాగిపోతున్న జీవితం.. కానీ ఓ మెసేజ్ ఆయన జీవితాన్ని తలకిందులు చేస్తుందని ఊహించలేకపోయాడు. అనుకోకుండా వచ్చిన ఓ మెసేజ్‌కు రిప్లై ఇవ్వడం.. చక్కగా సాగిపోతున్న అతని జీవితాన్ని మార్చేసింది. చివరకు పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ట్రేడింగ్ వ్యాపారంలో భారీ లాభాలంటూ ఓ వ్యక్తిని మోసం చేసిన మహిళ అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.26.37 లక్షలు కాజేసింది.. పెనమలూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగి. కొన్ని రోజుల క్రితం అతని సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని నంబర్ నుంచి ఓ మెసేజ్ వచ్చింది. ఎవరా అని రిప్లై ఇస్తే.. తన పేరు అన్నమనేని హేమాచౌదరిగా అవతలి వ్యక్తి పరిచయం చేసుకుంది. తన సొంతూరు రాజమండ్రి అని.. ప్రస్తుతం చెన్నైలో ఉన్నట్లు చెప్పింది.

ఆ తర్వాత ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి. ఈ క్రమంలోనే తన మాటలతో అతన్ని ఆకట్టుకుంది అవతలి వ్యక్తి. క్రమంగా తనపై నమ్మకం పెంచుకుంది. షేర్ల వ్యాపారం గురించి ప్రైవేట్ ఉద్యోగికి తెలియజేస్తూ.. ట్రేడింగ్ చేస్తే భారీగా లాభాలు వస్తాయని అతనికి ఆశ చూపించింది. ఎలా ట్రేడింగ్ చేయాలనే దానిపై వాట్సాప్ ద్వారా లింక్ పంపించి సూచనలు చేసింది. దీంతో ఆమె మీద నమ్మకంతో మనోడు తొలుత 50 వేల రూపాయలతో ట్రేడింగ్ ప్రారంభించాడు. అతనికి నమ్మకం కలిగించేందుకు తొలుత లాభాలు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. దీంతో మనోడికి నమ్మకం కలిగింది. లాభం వచ్చిన డబ్బులను విత్ డ్రా చేసుకున్నాడు. ఆ తర్వాత మరిన్ని లాభాలు వస్తాయని చెప్పటంతో పలు దఫాలుగా రూ. రూ.26.37 లక్షలు ట్రేడింగ్‌లో పెట్టాడు.

మనోడికి నమ్మకం కలిగించటం కోసం ఈ పెట్టుబడికి లాభం వచ్చినట్లు చూపించారు. లాభంతో కలిపి రూ.40.96 లక్షలు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. దీంతో ప్రైవేట్ ఉద్యోగి ఈ ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నించాడు. అయితే అందుకు వీలు కుదరలేదు. దీంతో తనకు ట్రేడింగ్ పరిచయం చేసిన హేమా చౌదరిని సంప్రదించే ప్రయత్నం చేశాడు.

అయితే ఆమె సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ప్రైవేట్ ఉద్యోగి.. పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. హేమా చౌదరి కోసం ఆరా తీస్తున్నారు. అయితే రెట్టింపు లాభాలు అంటూ ఇలా ట్రేడింగ్ పేరుతో వచ్చే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

# దిత్వా ఎఫెక్ట్ ఏడు మండలాల్లో భారీ వర్షం

**వాకాడులో రికార్డు స్థాయిలో 28 సెంటీమీటర్ల వర్షపాతం**

**- వందలాది ఎకరాల్లో నీట మునిగిన వరి పొలాలు**

**- గోడ కూలి వృద్ధురాలి మృతి**

**- నీటి ఉధృతికి కొట్టుకుపోయిన మొలకలపూడి రోడ్డు**

**- పునబాక వద్ద బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు**

**- నెలబల్లి చెరువు తూముకు గండ్లు**

తిరుపతి, డిసెంబరు 3 జిల్లాను తరచూ తుఫాన్‌లు వెంటాడుతున్నాయి. నిన్నగాక మొన్న మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టాలకు పరిహారం కూడా అందక మునుపే దిత్వా తుఫాన్ దూసుకొచ్చింది. వాయుగుండం నుంచి అల్ప పీడనంగా బలహీనపడినప్పటికీ జిల్లాపై మాత్రం ప్రభావం కనబరిచింది. గత నెల 30న తుఫాన్ ప్రభావం మొదలైనప్పటికీ మొదటి మూడు రోజులూ మోస్తరు వానలే కురిశాయి. అయితే మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ 22.30 గంటల వ్యవధిలోనే ఏడు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. వందలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. కూరగాయల పంటలు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకు 270 ఎకరాల్లో మాత్రమే వరిపొలాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందని తెలిపారు.

ఏడు మండలాల్లో భారీ వర్షాలు

దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 6 గంటల నడుమ జిల్లాలోని సముద్రతీర ప్రాంత ఏడు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. వాకాడు మండలంలో రికార్డు స్థాయిలో 280 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పొరుగునే ఉన్న చిట్టమూరు మండలంలో సైతం 261.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోట మండలంలో 220, దొరవారిసత్రం మండలంలో 135.8, నాయుడుపేటలో 115.2, ఓజిలిలో 109.4, తడలో 93.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. దిత్వా తుఫాన్ ప్రభావం గత నెల 30వ తేదీనే మొదలైనా ఆ రోజున కనిష్టంగా 4.8 మి.మీ.లు, గరిష్టంగా 45.2 మి.మీ.లు చొప్పున, ఈనెల 1న కనిష్టంగా 1.4 మి.మీ.లు, గరిష్టంగా 45.6 మి.మీ.లు వంతున, 2న ఉదయం 8.30 వరకూ అత్యల్పంగా 2 మిల్లీమీటర్లు, అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదవగా తర్వాతి 22.30 గంటల వ్యవధిలో తీర ప్రాంత మండలాల్లో రికార్డు స్థాయి వర్షాలు పడ్డాయి. ఈ భారీ వర్షాలకు స్వర్ణముఖి, కాళంగి, కైవల్య సహా పలు నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ప్రమాదాలు... స్తంభించిన రాకపోకలు- పెళ్లకూరు మండలం పాలచ్చూరు దళితవాడలో ఓజిలి మణెమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. పునబాక వద్ద శ్రీకాళహస్తి-నాయుడుపేట ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బురదలో కూరుకుపోయింది. మామిడి కాలువ ఉధృతికి పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెంబేడు చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరుకుంది. నెలబల్లి చెరువు తూముకు ఇరువైపులా గండ్లు పడ్డాయి. రైతులు ఇసుక బస్తాలతో వాటిని పూడ్చే పనిలో పడ్డారు.

- తొట్టంబేడు మండలం కాసరంలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన రేణుకమ్మ(60) గుడిసెలో నిద్రిస్తుండగా గోడ కూలడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది.
- గూడూరు మండలం విందూరులో విద్యుత్ స్తంభం కూలి పడటంతో ఆటో ధ్వంసమైంది.- కోట మండలం చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ నీట మునిగింది.
- చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. రొయ్యల కాలువ ఉధృతికి మల్లాం-నాయుడుపేట మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. తీర ప్రాంత గ్రామాలైన బురదగాలి, కొత్తపాలెం, కుమ్మరపాలెం గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.
- వాకాడు మండలంలో రొయ్యలకాలువ పొంగడంతో ముట్టెంబాక - చిట్టమూరు రోడ్డు తెగిపోయింది. స్వర్ణముఖి ఉధృతికి బాలిరెడ్డిపాలెం వద్ద వంతెనపైకి వరద నీరు చేరడంతో 16 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాయిలపాలెం నుంచి కొండూరుకు వెళ్లే రోడ్డుపైకి వరద నీరు రావడంతో రాకపోకలు నిలిపివేశారు.
- గూడూరు - రాజంపేట రోడ్డు వర్షానికి దారుణంగా దెబ్బతింది.
- కోట మండలం రుద్రవరం వద్ద మామిడి కాలువ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- చిల్లకూరు మండలం పారిచర్లవారిపాలెం వద్ద వరద నీరు కాజ్‌వే పైకి రావడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఉప్పుటేరు పొంగి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తిప్పగుంటపాలెం జల దిగ్బంధంలో చిక్కుకుంది.
- బాలాయపల్లి మండలం నిండలి సమీపంలో కైవల్యానది ప్రవాహం బ్రిడ్జిపైకి రావడంతో నిండలి, వాక్యం, దగ్గవోలు తదితర గ్రామాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకూ రాకపోకలు ఆగిపోయాయి.
- తడ మండలం పూడి గ్రామంలోకి నీరు ప్రవేశించింది. కారిజాత చెరువుకు గండిపడింది. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.

ఉధృతంగా ప్రవాహాలు

- కోట మండలం గోవిందపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్ పొంగి ప్రవహిస్తోంది.
- గూడూరు పంబలేరు చప్టాపై వరద నీరు ప్రవహిస్తోంది. వేములపాలెం చప్టాపై కూడా వరద నీటి ప్రవాహం మొదలైంది. విందూరు సమీపంలో రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. గూడూరు వద్ద కైవల్యా నది ఉధృతంగా ప్రవహిస్తోంది.
- కోట మండలంలో స్వర్ణముఖి నది ఉధృతికి ఆనకట్టల నుంచి నీరు పరవళ్లు తొక్కుతున్నాయి.
- దొరవారిసత్రం తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద ప్రవాహం జోరందుకుంది. వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ పొంగడంతో వంతెనపైకి వరద నీరు చేరింది. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట-వాకాడు రోడ్డు వంతెనపై కన్న కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగి నది, పాల కాలువ, నెర్రి కాలువ, కన్న కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- వాకాడు మండలం దుగరాజపట్నం నుంచి కొండూరుపాళెం వెళ్లే రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. వాకాడు స్వర్ణముఖి బ్యారేజీలోకి 14 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 11 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు- తడ మండలం కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, కారిజాత, కొండూరు, గ్రద్దగుంట గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి.
- గూడూరు చల్లకాలువ సమీపంలో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. పంటలు నీట మునిగాయి.
- చిట్టమూరు మండలం కొత్తగుంటలో వరినాట్లు నీట మునిగాయి.
- పెళ్లకూరు మండలం చిల్లకూరు, పెళ్లకూరు, పునబాక, కొత్తరు, అక్కగారిపేట, టెంకాయతోపు, భీమవరం, నెలబల్లి గ్రామాల్లో వందల ఎకరాల వరిపొలాలు నీటిపాలయ్యాయి.
- చిల్లకూరు మండలం పారిచర్ల వద్ద పంట పొలాల్లోకి నీరు ప్రవేశించింది.
- సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు, దామరాయి, మంగళంపాడు, మన్నే ముత్తేరి గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి.
- కోట మండలం వెంకన్నపాలెం, తిమ్మానాయుడుపాలెం గ్రామాల్లో పంట పొలాలన్నీ నీట మునిగాయి.
- ఓజిలి మండలం పున్నేపల్లి-సుగుటూరు రోడ్డులో మామిడి కాలువ పొంగడంతో కాపులూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.
- కేవీబీపురం మండలంలో పూడి గ్రామాలకు వెళ్లే సిమెంటు పైపులతో ఏర్పాటు చేసిన మట్టి వంతెన మళ్లీ కొట్టుకుపోయింది.

# సినిమా



## షాకుల మీద షాకులు..

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే.. పాపం ఈ ముద్దుగుమ్మకు అదృష్టం కలిసి రావడం లేదు. ఏ సినిమా చేసిన అది ఫ్లాప్ అవుతుంది. స్పెషల్ సాంగ్ చేసినా కూడా ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. రీసెంట్ డేస్ లో ఈ అమ్మడు నటించిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొడుతున్నాయి. ఏ భాషలో నటించినా ఆ సినిమాలు హిట్ అవడం లేదు.. గత కొద్దిరోజులుగా పూజా హెగ్డే నటించిన సినిమాలన్నీ నిరాశపరిచాయి. అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, ప్రభాస్, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ తదితర తెలుగు స్టార్ నటులందరితోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. అయితే వరుస హిట్లే కాదు.. ఆ తర్వాత వచ్చిన ఫ్లాపులు అమ్మాడి కెరీర్ ను అయోమయంలో పడేశాయి. రాధేశ్యామ్, ఆచార్య, బీస్ట్ చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో పూజా సైలెంట్ అయ్యింది. కొన్నాళ్లుగా తెలుగు, తమిళంలో అవకాశాలు తగ్గిపోవడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. అక్కడ కూడా ఫ్లాపులే ఎదురుకావడంతో కొన్నాళ్లు సినిమాలకు దూరంగా ఉండిపోయింది.ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మకు వచ్చిన అవకాశాలు కూడా వెనక్కి వెళ్ళిపోతున్నాయని తెలుస్తుంది. రీసెంట్ గా కూలి సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. సాంగ్ హిట్ అయ్యింది కానీ సినిమా ఫ్లాప్ అయ్యింది. ఇటీవలే పూజా హెగ్డేకు ఓ క్రేజీ ఆఫర్ వచ్చిందని టాక్. దర్శకుడు, నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ నటిస్తున్న కాంచన 4 సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుందని ఫిలిం సర్కిల్‌లో వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు పూజా స్థానంలోకి మరో ముద్దుగుమ్మను సెలక్ట్ చేశారని తెలుస్తుంది. వరుస ఫ్లాప్స్ తో సతమతం అవుతున్న పూజా హెగ్డే కు కాంచన 4 బంపర్ ఆఫర్ అనే చెప్పాలి.ఈ సినిమాతో పూజాహెగ్డే బ్యాడ్ లక్ వదిలి తిరిగి హిట్ ట్రాక్ లోకి వస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు కాంచన 4లోకి మరో హీరోయిన్ నటిస్తుందని తెలుస్తుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ రష్మిక. పూజా ప్లేస్ లో కాంచన 4లో రష్మిక నటిస్తుందని టాక్ ఇప్పుడు ఫిలిం సర్కిల్ లో చక్కర్లు కొడుతుంది. ప్రస్తుతం రష్మికాకు పాన్ ఇండియా క్రేజ్ ఉంది. బాలీవుడ్ లోనూ ఈ ముద్దుగుమ్మకు విపరీతమైన క్రేజ్ ఉంది. అందుకే రష్మికాను కంచన4 లోకి తీసుకున్నారని అంటున్నారు. అలాగే ఈ సినిమాలో రష్మిక దయ్యంగా కనిపించనుందని అంటున్నారు. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.






## పాలు తాగినప్పుడు ఇలాంటి ఆహారాలు అస్సలు తినకూడదు.

పాలు మన రోజువారీ ఆహారంలో అత్యంత పోషకమైన భాగాలలో ఒకటిగా చెబుతారు. పాలు శరీరానికి కావాల్సిన బలాన్ని అందిస్తాయి. శరీర పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పాలు కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. కానీ పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి అస్సలు తీసుకోకూడదు. అవేంటో ఇక్కడ చూద్దాం

చాలా మందికి పాలు అన్ని రకాల ఆహారాలతో తీసుకోకూడదని తెలియదు. అలాంటప్పుడు పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి తీసుకోవటం వల్ల లాభాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. పాలతో కలిపి ఎప్పుడూ తినకూడని ఆహారాలు కొన్ని ఉన్నాయి. ఈ కాంబినేషన్ శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

పాలు నారింజ, నిమ్మ, జామ, ఇతర పుల్లని పండ్లు పాలతో కలిపి ఎప్పుడూ తీసుకోకూడదు. ఈ కాంబినేషన్ తీసుకుంటే అవి కడుపులో పాలు గడ్డ కట్టేలా చేస్తాయి. దీని వలన అజీర్ణం, కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలను కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం పాలు, చేపలను కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. చర్మంపై మచ్చలు, అలర్జీలు లేదా దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. పాలు, ఉప్పు కలిగిన ఆహారాల కలయిక జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. శరీర జీవక్రియ ప్రక్రియను బలహీనపరుస్తుంది. ఇది భారంగా, అసౌకర్యంగా ఉంటుంది.పాలతో ఊరగాయ తినడం వల్ల ఎసిడిటీ, గ్యాస్ సమస్యలు వస్తాయి. ఎందుకంటే పులియబెట్టడం, మసాలా దినుసులు పాలు చల్లదనాన్ని దెబ్బతీస్తాయి. పాలతో ఉల్లిపాయలను తీసుకోవడం హానికరం అని చెబుతారు. ఎందుకంటే ఇది శరీరంలో వేడిని, విషాలను పెంచుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో అసమతుల్యతకు దారితీస్తుంది. పాలు, ముల్లంగిని కలిపి తీసుకోవడం వల్ల చర్మ అలర్జీలు, దురద లేదా పుండ్లు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే వాటి వ్యతిరేక లక్షణాలు శరీర సమతుల్యతను దెబ్బతీస్తాయి.



## బఠానీ తొక్కలో ఏముందో తెలుసా..?

మనం బఠానీ తొక్కలను పనికిరానివిగా భావించి చెత్తబుట్టలో పడవేస్తుంటాం. దాదాపుగా అందరూ ఇదే తప్పు చేస్తుంటారు. ఆరోగ్యానికి అసలైన సంపద ఈ తొక్కలోనే ఉందని మీకు తెలిస్తే షాక్ అవుతారు. బఠానీ తొక్కలు దాని ధాన్యాల మాదిరిగానే ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. బఠానీ తొక్కల్లో విటమిన్లు, ఖనిజాలు కంటి చూపు, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు బఠానీ తొక్కలు ఎక్కువగా తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. శీతాకాలంలో పచ్చి బఠానీలు పుష్కలంగా లభిస్తాయి. మీరు వాటిని పులావ్, బంగాళాదుంప-బఠానీ కూర, మటర్ పన్నీర్‌లో ఎక్కువగా మిక్స్ చేసి వండుతుంటారు. అయితే, మీరు వాటిని తొక్క తీసినప్పుడు అది పనికిరానిదని భావించి తొక్కను చెత్తబుట్టలో పడేస్తుంటారు. అయితే, ఈ తొక్కలో అనేక పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, దానిని పడేసి పొరపాటు చేయవద్దు అంటున్నారు. పచ్చి బఠానీ తొక్క గొప్ప ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం..శీతాకాలంలో పచ్చి బఠానీలు పుష్కలంగా లభిస్తాయి. ఆయుర్వేదం, శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, బఠానీ గింజల మాదిరిగానే వాటి తొక్కలు కూడా ఆరోగ్యానికి ఒక వరంలా పనిచేస్తాయి.. తాజా బఠానీ పెంకులు అనేక ప్రయోజనకరమైన లక్షణాలను కలిగి ఉంటాయి. ఆయుర్వేదంలో వాటిని జీర్ణ సహాయకులుగా, శరీరానికి పోషకమైనవిగా పరిగణిస్తారు.బఠానీ తొక్కల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కడుపుకు మేలు చేస్తుంది. ఫైబర్ కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. గ్యాస్ ఏర్పడకుండా నిరోధిస్తుంది. ఇది కడుపు నెమ్మదిగా, హాయిగా పనిచేయడానికి సహాయపడుతుంది.ఫైబర్ అధికంగా ఉండే ఆహారం మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించేలా చేస్తుంది. తద్వారా మీరు తక్కువ తినేలా చేస్తుంది. తొక్క తీసిన కూరగాయలు లేదా చట్నీలు తినడం వల్ల తరచుగా ఆకలి బాధలు రాకుండా ఉంటాయి. అందువల్ల, బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి ఈ తొక్కలు ఉపయోగపడతాయి.బఠానీ పెంకుల్లో రాగి, విటమిన్లు సి, కె, పొటాషియం, కాల్షియం వంటి అనేక ఇతర పోషకాలు కూడా ఉన్నాయి. పొటాషియం శరీరంలో ద్రవ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఇది గుండె సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. ఎముకలు, దంతాలను బలోపేతం చేయడానికి కాల్షియం ఒక ముఖ్యమైన పోషకం. అయితే రాగి శరీరం శక్తి ఉత్పత్తి ప్రక్రియ. రక్త నిర్మాణంలో పాత్ర పోషిస్తుంది.విటమిన్ సి శరీరం రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. దానిని బలపరుస్తుంది. విటమిన్ కె సాధారణ రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతుంది. ఎముకలను బలపరుస్తుంది. తొక్కలోని కెరోటినాయిడ్స్ వంటి సహజ రసాయనాలు కూడా కళ్ళకు ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. ఈ సమ్మేళనాలు సాధారణ కంటి కణాల పనితీరును నిర్వహించడానికి, కాంతి నష్టం నుండి రక్షించడానికి సహాయపడతాయి.బఠానీ తొక్కలను ఎలా ఉపయోగించాలి: మీరు బఠానీ తొక్కలతో కూరలు, చట్నీ వంటివి తయారు చేసుకోవచ్చు. మీకు కొత్త రకమైన చట్నీ కావాలంటే మీరు బఠానీ తొక్కలతో చట్నీ కూడా తయారు చేసుకోవచ్చు. దీనిని రోటీ, పూరీ, పరాఠా, అన్నం, పప్పు, ఏదైనా స్నాక్, చాట్, సమోసా, పకోడా మొదలైనవి కూడా వాటితో తినవచ్చు.

## క్లాస్ కాదు మాస్..

భారత జట్టు తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో రాహుల్ కేవలం 43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులతో 66 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఆడి, టీమిండియా స్కోరును 350 మార్కు దాటించాడు. మొదటి మ్యాచ్‌లోనూ (60 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడిన రాహుల్, ఈ సిరీస్‌లో డెత్ ఓవర్లలో కీలక పరుగులు చేయడంలో తనను తాను అత్యుత్తమ ఫినిషర్‌గా నిరూపించుకుంటున్నాడు.కేఎల్ రాహుల్ ఇప్పుడు వన్డే ఇంటర్నేషనల్స్ లో సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. 2023 నుంచి డెత్ ఓవర్లలో (అంటే 41 నుంచి 50 ఓవర్ల మధ్య) అత్యధిక పరుగులు చేసిన ప్రపంచంలోనే మూడో బ్యాట్స్‌మెన్గా నిలిచాడు. ఈ గణాంకాలు అతని ఫినిషింగ్ సామర్థ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. రాహుల్ 2023 నుంచి 142.76 స్ట్రైక్ రేట్‌తో డెత్ ఓవర్లలో మొత్తం 424 పరుగులు సాధించాడు. ఈ విషయంలో అతను అత్యధిక పరుగులు చేసిన భారతీయ బ్యాట్స్‌మెన్గా రికార్డు సృష్టించాడు.

రికార్డుల లిస్ట్

ఈ అత్యధిక పరుగుల జాబితాలో దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ 168.11 స్ట్రైక్ రేట్‌తో 464 పరుగులతో మొదటి స్థానంలో ఉన్నాడు. శ్రీలంకకు చెందిన చరిత్ అసలంక 147.97 స్ట్రైక్ రేట్‌తో 438 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, కేఎల్ రాహుల్ 424 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్ (413 పరుగులు) నాలుగో స్థానంలో ఉన్నాడు.సిరీస్‌పై భారత్ పట్టు

దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ రెండు వన్డేల్లోనూ భారత బ్యాట్స్‌మెన్‌లు భారీ స్కోర్లు నమోదు చేశారు. మొదటి మ్యాచ్‌లో 349 పరుగులు చేసిన భారత్, రెండో మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105) సెంచరీలతో పాటు కేఎల్ రాహుల్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా 358 పరుగుల భారీ టార్గెట్‌ను సఫారీలకు ఇచ్చింది. ఈ భారీ స్కోర్‌ను గనుక రాయ్‌పూర్‌లో భారత్ డిఫెండ్ చేసుకోగలిగితే, మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుని అజేయ ఆధిక్యాన్ని సాధిస్తుంది.



## సిరీస్ సమం చేసిన సఫారీలు

ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియంలో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు అద్భుతమైన పోరాటం చేసి చారిత్రక విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, సెంచరీ హీరోలు విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105)ల వీరోచిత ఇన్నింగ్స్‌లతో సఫారీల ముందు 359 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. అయితే ఎయిడెన్ మార్క్రమ్, మాథ్యూ బ్రీట్జ్‌కే, డేవాల్డ్ బ్రెవిస్‌ల అద్భుత ప్రదర్శనతో సౌతాఫ్రికా ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు రోహిత్ శర్మ (14), యశస్వి జైస్వాల్ (22) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ ఇద్దరూ అసాధారణంగా ఆడారు. రుతురాజ్ గైక్వాడ్ తన తొలి వన్డే సెంచరీని (83 బంతుల్లో 105) సాధించగా, విరాట్ కోహ్లీ తన 84వ అంతర్జాతీయ సెంచరీని (93 బంతుల్లో 102) పూర్తి చేశాడు. వీళ్లిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు.

వీరిద్దరూ ఔటయ్యాక, తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 66 నాటౌట్), రవీంద్ర జడేజా (24 నాటౌట్) కలిసి ఆఖర్లో 69 పరుగుల కీలక భాగస్వామ్యం అందించి స్కోరును 358/5కి చేర్చారు. సౌతాఫ్రికా తరపున మార్కో జాన్సెన్ రెండు వికెట్లు తీశాడు.

సౌతాఫ్రికా ఛేజింగ్

359 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా క్వాలిటీ ఛేజింగ్ చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (8) త్వరగా ఔటైనా, ఎయిడెన్ మార్క్రమ్, కెప్టెన్ టెంబా బావుమా (46) రెండో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. అద్భుతంగా ఆడిన మార్క్రమ్ 88 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసి, మొత్తం 98 బంతుల్లో 110 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సులు) చేసి కీలక పాత్ర పోషించాడు.

మార్క్రమ్ ఔటైన తర్వాత కూడా మాథ్యూ బ్రీట్జ్‌కే (64 బంతుల్లో 68), యువ హిట్టర్ డేవాల్డ్ బ్రెవిస్ (34 బంతుల్లో 54, 5 సిక్సులు) చెలరేగి ఆడారు. వీరి హాఫ్ సెంచరీల కారణంగా సౌతాఫ్రికా విజయం దిశగా దూసుకెళ్లింది. డీ జార్జి రిటైర్డ్ హర్ట్ అవ్వడం, జాన్సెన్ (2) వికెట్ కోల్పోయినా, చివరి ఓవర్లలో ఆడిన ఆటగాళ్లు ప్రశాంతంగా పరుగులు రాబట్టి లక్ష్యాన్ని ఛేదించారు.తుది ఫలితం

సౌతాఫ్రికా ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి, ఉత్కంఠభరితంగా జరిగిన రెండో వన్డేలో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఇప్పుడు 1-1తో సమం అయ్యింది. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో, చివరి వన్డేపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. మూడో వన్డే డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరుగనుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com